సాక్షి జగిత్యాల

ఆదివారం । 31 । మార్చి । 2024



హర.. హర మహాదేవ

వేములవాడ: రాజన్న ఆలయంలో కొనసాగుతున్న శివకల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు చేశారు. వీరశైవుల ఖడ్గాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆది(సా॥)	సహర్ సోమ(ఉ॥)
కరీంనగర్	6.27	4.41
పెద్దపల్లి	6.34	4.48
రాజన్న సిరిసిల్ల	6.34	4.49
జగిత్యాల	6.34	4.48

వాతావరణం

గరిష్టం/కనిష్టం 42.0/27.0

వాతావరణం పొడిగా ఉంటుంది. ఎండ వేడిమి పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటూ అసౌకర్యంగా ఉంటుంది.

చల్లని సేవలకు సలామ్



తడారుతున్న గొంతులకు చల్లని నీరందించి ప్రాణాలు నిలుపుతూ.. నీటి జాడల కోసం వెతుకుతున్న పిచ్చుకల కోసం నీటితొట్టెలు పెడుతూ.. అలసిపోయిన ప్రయాణికులకు మజ్జిగ ఇచ్చి సత్తువ నింపుతూ.. ఆదర్శంగా నిలుస్తున్నారు పలువురు దాతలు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా వేసవిలో పలువురు స్వచ్ఛందంగా చలివేంద్రాలు.. మజ్జిగ కేంద్రాలు.. నీటితొట్లు ఏర్పాటు చేసి దాహార్తి తీరుస్తున్నారు. ఎండాకాలంలో గుక్కెడునీరుపోసి ప్రాణాలు నిలుపుతున్న మానవతవాదులపై ఈ వారం సండే స్పెషల్... 8లో▸

న్యూస్‌రీల్

ఘనంగా పుష్పయాగం



శ్రీలక్ష్మీనృసింహుడికి ఏకాంతోత్సవం

ధర్మపురి: బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వార్లకు పుష్పయాగం, ఏకాంతోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారికి పుష్పయాగం నిర్వహించారు. ప్రధాన ఆలయంలోని శ్రీలక్ష్మీనృసింహస్వాములకు ఏకాంతోత్సవాన్ని నిర్వహించారు. పుష్పయాగం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో వివిధ రకాలైన పూలు, చెట్ల ఆకులతో పుష్పయాగం, ఏకాంతోత్సవం సందర్భంగా ప్రధాన ఆలయంలో ఐదు ప్రదక్షణలు చేశారు. వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచారి, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులున్నారు.

రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తేవాలి



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రఘువరణ్

ఇబ్రహీంపట్నం: రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తేవాలని జెడ్పీ సీఈవో, మండల ప్రత్యేక అధికారి రఘువరణ్ అన్నారు. మండలంలోని యామాపూర్, ఫకీర్ కొండాపూర్‌లో ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. నర్సరీలోని మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. ఇబ్రహీంపట్నం పంచాయతీ రికార్డులు పరిశీలించారు. ఎంపీవో కృపాకర్, సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ ఉమాపతి, ఏపీఎం శంకర్, పంచాయతీ కార్యదర్శులు సరిత, రామకృష్ణ, దివాకర్, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన నృత్యప్రదర్శనలు



ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను అలరించాయి. ఆలయంలోని శేషప్ప కళావేదికపై జగిత్యాలకు చెందిన మేధిని కళాబృందం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ధర్మపురికి చెందిన కుమారి శివానీ బృందం నిర్వహించిన ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. కళాకారులను ఆలయం పక్షాన సన్మానించారు.





ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు



పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

హమ్మయ్యా.. పరీక్షలు ముగిశాయి

జగిత్యాల: పదో తరగతి పరీక్షలు శనివారంతో ముగిశాయి. దీంతో విద్యార్థులు ఊపిరిపీల్చుకున్నారు. చివరిరోజు రెగ్యులర్ పరీక్ష కేంద్రాల్లో 11,396 మందికి 11376 మంది హాజరయ్యారు. సప్లిమెంటరీకి 12మందికి 9 మంది హాజరయ్యారు. రెగ్యులర్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని డీఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు.

పడిపోయిన భూగర్భజలం

- మార్చిలో 5.40 మీటర్ల లోతుకు..
- పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జనం విలవిల



వ్యవసాయ బావుల ద్వారా వరి పంటకు నీరు అందిస్తున్న దృశ్యం

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో భూగర్భజలాలు రోజురోజుకూ పతాళానికి చేరుతున్నాయి. ఓ వైపు సాగు, మరో వైపు రోజువారి అవసరాలకు నీటి వినియోగం ఎక్కువ కావడంతో నీటిమట్టాలు తగ్గుతున్నాయి. ఒక్క నెల లోనే జిల్లాలో నీటిమట్టం 0.47 మీటర్లు పడిపోయిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇకఅత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే ఏప్రిల్, మేలో నీటిమట్టం మరెంత పడిపోతుందోనన్న ఆందోళన మొదలైంది.

బల్దియాల్లో పెరుగుతున్న నీటి వినియోగం

జిల్లాలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీలుగా ఉన్నాయి. ఈ పట్టణాల్లో నీటి వినియోగం భారీగా పెరుగుతోంది. ప్రతిఇంటికీ బోరుబావులు ఉండడం.. అవసరాలకు ప్రతిరోజూ నీటిని తోడుతుండడంతో భూగర్భ జలాలు క్రమంగా పడిపోతున్నాయి. జిల్లాకేంద్రంలో గతనెల 7.09 మీటర్ల లోతులో ఉన్న భూగర్భ జలాలు ప్రస్తుతం 7.42 మీటర్లకు చేరాయి. కోరుట్లలో ఫిబ్రవరిలో 8.61మీటర్ల లోతులో ఉన్న నీరు మార్చి వరకు 9.37 మీటర్లకు పడిపోయాయి. మెట్‌పల్లిలో గత నెల 4.40మీటర్ల లోతులో ఉన్న భూగర్భజలం మార్చి చివరి నాటికి 5.08 మీటర్లకు చేరుకుంది. రాయికల్‌లో ఫిబ్రవరిలో 2.79మీటర్ల లోతు ఉండగా.. ప్రస్తుతం 3.08 మీటర్లకు చేరింది. ఇక ధర్మపురిలో గతనెల 7.20 మీటర్ల లోతులో ఉన్న భూగర్భజలం ప్రస్తుతం 7.51 మీటర్లకు చేరుకుంది.

నాన్‌ఆయకట్టు ప్రాంతాల్లో పడిపోతున్న నీటి మట్టం

జిల్లాలో నాన్‌ఆయకట్టు (కాలువల ద్వారా నీరందని) ప్రాంతాలైన మల్యాల, మేడిపల్లి, కథలాపూర్, కొడిమ్యాల, మెట్‌పల్లిలో భూగర్భజలాలు మరింతగా పడిపోతున్నాయి. మల్యాలలో గతనెల 5.89 మీటర్ల లోతులో ఉన్న నీరు ఇప్పటివరకు 0.78 మీటర్లు పడిపోయి 6.67 మీటర్లకు చేరింది. కొడిమ్యాల 8.61 మీటర్లు ఉండగా.. 2.09 మీటర్లకు పడిపోయి 10.70మీటర్లు, కథలాపూర్ 2.56 మీటర్లకు 0.45 మీటర్లు పడిపోయి ప్రస్తుతం 3.01 మీటర్లు, మేడిపల్లిలో 2.76 మీటర్లుగా ఉన్న నీటిమట్టం 0.47 మీటర్లు పడిపోయి, ప్రస్తుతం 3.23 మీటర్లకు చేరుకుంది.

నీటిని పొదుపుగా వాడుకోవాలి



నీటి వినియోగం పెరిగిన నేపథ్యంలో పొదుపుగా వాడుకోవాలి. రానున్న నెలలో భూగర్భజలం మరింత లోతుకు చేరుకునే అవకాశం ఉంది. నాన్ ఆయకట్టు ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లో భూగర్భజల మట్టం పడిపోతోంది.

– నర్సింహులు, జిల్లా భూగర్భజల వనరుల శాఖ అధికారి

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

- అదనపు కలెక్టర్ రాంబాబు



తాటిపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

జగిత్యాలరూరల్: రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి, అర్బన్ మండలం అంబారిపేటలో ఐకేపీ ఆధ్వర్యంలో శనివారం కేంద్రాలు ప్రారంభించారు. రైతులకు ఇబ్బంది రాకుండా ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సంపత్‌రావు మాట్లాడుతూ కొనుగోళ్లు అయిపోయే వరకూ కేంద్రాలు నిర్వహిస్తామన్నారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్, డీఎం హతిరాం, ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ రాంమోహన్, ఐకేపీ ఏపీడీ చరణ్‌దాస్, డీపీఎం విజయలక్ష్మీ, ఎంపీడీవోలు రమాదేవి, విజయలక్ష్మీ, ఏపీఎం గంగాధర్, సివిల్ సప్లై అధికారి వరప్రసాద్, ఏఈవోలు శ్రీనివాస్, నాగరాజు, సీసీలు గంగారాం, విద్యాసాగర్ పాల్గొన్నారు.

రామన్నపేటలో

మల్యాల: మల్యాల మండలం రామన్నపేటలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) రాంబాబు, డీఆర్డీవో పీడీ సంపత్ రావు ప్రారంభించారు. రైతుల వరుస క్రమం ప్రకారం తూకం వేయాలన్నారు. ఏ గ్రేడ్ రకానికి క్వింటాల్‌కు రూ.2,203, బీ గ్రేడ్‌కు రూ.2,183 మద్దతు ధర చెల్లించనున్నట్లు తెలిపారు. అదనపు డీఆర్డీవో చరణ్, డీపీఎం విజయ భారతి, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మునీందర్, ఏపీఎం రాజయ్య, ఆర్‌ఐ తిరుపతి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కనుమరుగు ఖాయం



విలేకరులతో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

మెట్‌పల్లి: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ కనుమరుగు కావడం ఖాయమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థులే దొరకడం లేదని, అక్రమ ఆస్తులను కాపాడుకునేందుకు కేసీఆర్ బీజేపీతో కలవడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. నిజామాబాద్ నుంచి ఒకసారి కవితకు, మరోసారి అర్వింద్‌కు అవకాశమిస్తే ఈ ప్రాంతంలోని చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించలేకపోయారన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ఆమేరకు కమిటీ వేసి చర్యలు తీసుకుంటోందన్నారు. దేశాన్ని ప్రధాని మోదీ అదానీ, అంబానీ చేతిలో కీలుబొమ్మగా మార్చారని ఆరోపించారు. కార్పొరేట్ వ్యక్తులు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను మాఫీ చేస్తున్న కేంద్రం.. రైతుల రుణాలను మాత్రం మాఫీ చేయడం లేదన్నారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో నీటి స మస్యపై కొప్పుల ఈశ్వర్ ధర్నాలు చేయడం సిగ్గుచేట న్నారు. పదేళ్ల మంత్రిగా ఉన్న ఆయన దీని గు రించి ఒక్కసారైనా అప్పటి ప్రభుత్వంతో చర్చించా రా.. ? అని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు జువ్వాడి కృష్ణారావు, జెట్టి లింగం తదితరులున్నారు.



వరదకాలువ నుంచి నీరివ్వండి



కథలాపూర్ శివారులో రోడ్డుపై బైఠాయించిన రైతులు

- కథలాపూర్ శివారులో రైతుల ధర్నా
- పంటలు కాపాడాలని డిమాండ్

కథలాపూర్(వేములవాడ): వరదకాలువ నుంచి నీరు వదిలి పంటలు కాపాడాలని డిమాండ్ చేస్తూ కథలాపూర్ శివారు వరదకాలువ వంతెనపై శనివారం రైతులు ధర్నాకు దిగారు. బొమ్మెన, తక్కళ్లపెల్లి, బీమారం మండలం మన్నెగూడెం నుంచి రైతులు భారీగా తరలివచ్చారు. వరదకాలువ నీరు రాక చేతికందే పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా స్పందన కరువైందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎండకాలంలోనూ వరద కాలువ నీటితో కళకళలాడిందని, ఇప్పుడు వెలవెలబోతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో ఆ దారి మీదుగా వెళ్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రైతుల వద్దకు వచ్చారు. అధికారులతో మాట్లాడామని, వరదకాలువకు నీరు వదిలారని రైతులకు వివరించారు. వరదకాలువ ద్వారా నీరు కథలాపూర్ వరకు చేరితేనే ఆందోళన విరమిస్తామని రైతులు తేల్చిచెప్పారు. ఎస్సై నవీన్ కుమార్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మెట్‌పల్లి మండలం జగ్గసాగర్ శివారు వరద కాలువ గేట్ ద్వారా నీళ్లు వదిలారని, రైతులతో తాను అక్కడికి వస్తానని ఎస్సై చెప్పడంతో రైతులు ఆందోళనను విరమించారు.

గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే నీటి సమస్య

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే సాగునీటి సమస్యలు వస్తున్నాయని ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పోసానిపేటలో కృతజ్ఞత ర్యాలీలో పాల్గొన్న ఆయన విలేకరులతో వరదకాలువపై క్రాస్ రెగ్యులేటర్ నిర్మించకపోవడంతో కథలాపూర్, బీమారం, మేడిపెల్లి మండలాలకు నీరందడంలేదని, ఎస్సారెస్పీలో నీరు తక్కువగా ఉండటంతో వదలడం కష్టమన్నారు. వరదకాలువకు రివర్స్ పంపింగ్ ద్వారా నీటిని విడుదల చేస్తామంటే మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయి చుక్కనీరు లేదన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు దివాకర, రాంబాబు

జగిత్యాల: ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉ ద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. శనివారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ మాట్లాడారు. పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ ముగిసిన వెంటనే ఉద్యోగులందరికీ పో స్టల్ బ్యాలెట్ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫాం 12ను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఓటరు ఫెసిలిటీ కేంద్రం వద్ద ఓటు హక్కు వినియోగించుకోవాలనే అంశం ఎస్‌ఎంఎస్‌ద్వారా పంపిస్తామన్నా రు. ఫాం12 తీసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ప్రత్యేకాధికారిని కేటాయించాలన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ హెడ్‌క్వార్టర్స్‌లో మేజిన, పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో మే 4 నుంచి మే 8 వరకు ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసి పోస్టల్ బ్యాలెట్ స్వీకరించాలన్నారు. 85 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులకు ఇంటి వద్ద ఓటు వినియోగించుకోవాలనుకునే వారు ఏప్రిల్ 23లోపు ఫాం డీ సమర్పించాలన్నారు. రాజకీయ పార్టీలకు సమాచారం అందించాలన్నారు. అదనపు కలెక్టర్లు దివాకర, రాంబాబు, ఆర్డీవో లు మధుసూదన్, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలపై పోలీసుల నజర్

- జిల్లాలో ఏడు చెక్‌పోస్టుల ఏర్పాటు
- కోడ్ అమలుకు పకడ్బందీ చర్యలు
- పోలీస్ సిబ్బందితో తనిఖీలు

జగిత్యాలక్రైం: పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటినుంచి జిల్లా పోలీసు శాఖ అలర్ట్ అయ్యింది. అంతర్ జిల్లా సరిహద్దుల్లో విస్తృత తనిఖీలు చేపట్టేలా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు చేపడుతున్నారు. ఇందుకు పోలీసులు, ఎన్నికల ప్రత్యేక బృందాలు భాగస్వామ్యం అవుతున్నాయి. జిల్లా సరిహద్దుల్లో ఏడు చెక్‌పోస్టులను పోలీసులు ప్రారంభించారు. ఇందులో మెట్‌పల్లి శివారు గండి హనుమాన్ దేవాలయం వద్ద, రాయికల్ మండలం బోర్నపల్లి బ్రిడ్జి వద్ద, మల్లాపూర్ మండలం ఒబులాపూర్ బ్రిడ్జి వద్ద, బీర్‌పూర్ మండలం కమ్మునూర్ వద్ద, ధర్మపురి మండలం రాయపట్నం వద్ద, కొడిమ్యాల మండలం దొంగలమర్రి వద్ద, కథలాపూర్ మండలం కలికోట వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి 24 గంటల పాటు తనిఖీలు చేపడుతున్నారు.

రూ.50 వేలకు మించి తీసుకెళ్తే సీజే..

ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రతివ్యక్తి రూ.50వేల లోపు నగదు తీసుకెళ్లే వెసులుబాటు ఉంది. రూ.50 వేలకు మించి నగదు ఉంటే ఆ డబ్బుకు సంబంధించిన పూర్తి ఆధారాలను వెంట తీసుకెళ్తే ఎలాంటి ఇబ్బందులూ ఉండవు. ఎలాంటి అనుమతులు లేకుండా, ఆధారాలు లేకుండా డబ్బుగానీ, ఇతర సామగ్రిని పెద్ద ఎత్తున తరలిస్తే వాటిని పోలీసులు, ఎన్నికల అధికారుల బృందం సీజ్ చేయనున్నారు.



దొంగలమర్రి చెక్‌పోస్టు వద్ద తనిఖీలను పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ వినోద్‌కుమార్

ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో తనిఖీలు

ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా డబ్బు, మద్యం, ఇతర వస్తువులను తరలించి ఓటర్లను ప్రలోభపెట్టకుండా ప్రతిపోలీస్‌స్టేషన్ పరిధిలో రోజు పోలీసులు విస్తృత వాహనాల తనిఖీ చేపడుతున్నారు. ఎలాంటి ఆధారంలేని డబ్బు అయినా, మద్యం అయినా సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నారు.

నిరంతర తనిఖీలు

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నం. జిల్లా సరిహద్దుల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. చెక్‌పోస్టుల్లో సిబ్బంది 24 గంటల పాటు తనిఖీలు చేస్తున్నారు. – సన్‌ప్రీత్‌సింగ్, ఎస్పీ

యశోద హాస్పిటల్స్ – యశోద మెడికల్ సెంటర్

3-1-397/ఎ, హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ ప్రక్కన, అంబేద్కర్ రోడ్, కరీంనగర్

సూపర్ స్పెషాలిటీ వైద్యనిపుణులు మీ చేరువలో

ప్రత్యేకతలు	వైద్యులు	తేది
కిడ్నీ వ్యాధులు : మూత్రపిండాలలో రాళ్ళు, మంట, మూత్ర విసర్జనలో సమస్యలు, అధిక రక్తపోటు, షుగర్ వ్యాధిగ్రస్తులలో మూత్రపిండాల సమస్యలు	డా॥ మహేష్ కోట	01-04-2024 1వ సోమవారం ఉదయం 10 గం॥ నుండి సాయంత్రం 4 గం॥ వరకు
వెన్నెముక వ్యాధులకు కన్సల్టేషన్: నడుము నొప్పి, మెడ నొప్పి, కాళ్ళు చేతులు తిమ్మిర్లు, నరం ఒత్తిడి సమస్యలు, వెన్నెముక (ఫ్రాక్చర్ ట్రీట్‌మెంట్స్), పార్శ్వగూని చికిత్స (స్కోలియోసిస్ సర్జరీ), వెన్నెముక ఇన్‌ఫెక్షన్, అడ్వాన్స్‌డ్ స్పైనల్ టెక్నిక్స్	డా॥ కిరణ్ కుమార్ లింగుట్ల	02-04-2024 1వ మంగళవారం ఉ॥ 10 గం॥ నుండి మ॥ 4 గం॥ వరకు
గ్యాస్ట్రో వ్యాధులు : ప్యాంక్రియాస్, లివర్, కడుపు మరియు ప్రేగులకు సంబంధించిన వ్యాధులు	డా॥ ఎం.ఎస్. పవన్ కుమార్	
న్యూరో & ఇంటర్వెన్షనల్ రేడియాలజీ వ్యాధులు : మెదడులో రక్తనాళాలు బ్లాక్ అవ్వడం, కాళ్ళల్లో రక్తనాళాలు మెలిక పడటం, కాన్పు తరువాత గర్భాశయంలో అధిక రక్తస్రావం, దగ్గినపుడు రక్తం పడటం, డయాలసిస్ ఫిస్టులా బ్లాక్ అవ్వడం	డా॥ శ్రీహర్ష్ వంకాయలపాటి	03-04-2024 1వ బుధవారం ఉదయం10 గం॥ నుండి మధ్యాహ్నం 4 గం॥ వరకు
జాయింట్ రీప్లేస్‌మెంట్ : మోకాళ్ళు, తుంటి, మోచేయి, భుజం, కీళ్ళు వెన్నెముక నొప్పులు మరియు ఎముకల సంబంధిత వ్యాధులు	డా॥ అమిత్ రెడ్డి పి	
కండరాలు, కీళ్ళ నొప్పుల వ్యాధులు : కండరాల నొప్పులు, కీళ్ళవాపులు, ఆటోఇమ్యూన్, అన్నిరకముల ఎముకల వ్యాధులు	డా॥ వి. రాజేంద్ర వరప్రసాద్	04-04-2024 1వ గురువారం ఉదయం10 గం॥ నుండి మధ్యాహ్నం 4 గం॥ వరకు
గ్యాస్ట్రో వ్యాధులు : జీర్ణకోశ, ఊబకాయం, అబ్డామినల్ క్యాన్సర్ మరియు ప్రేగులకు సంబంధించిన వ్యాధుల	డా॥ కిరణ్ పెద్ది	
కిడ్నీ వ్యాధులు: కిడ్నీ మార్పిడి అవసరం ఉన్న వాళ్ళు, డయాబెటిస్ వల్ల వచ్చే కిడ్నీ వ్యాధులు, అధిక రక్తపోటు, మధుమేహం వ్యాధిగ్రస్తులలో మూత్రపిండాల సమస్యలు, క్రానిక్ & అక్యూట్ కిడ్నీ వ్యాధి సమస్యలు	డా॥ అరుణ్ కుమార్ పొన్న	05-04-2024 1వ శుక్రవారం ఉదయం10 గం॥ నుండి మధ్యాహ్నం 4 గం॥ వరకు
క్యాన్సర్, హెమటాలజీ వ్యాధులు : అసాధారణ మచ్చలు, గడ్డలు, మానని పుండ్లు, రొమ్ములో నొప్పిలేని కణుతులు, దగ్గినప్పుడు రక్తం రావడం, ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గడం / పెరగడం, బ్లడ్ క్యాన్సర్, లింఫోమా, రక్తహీనత, అన్ని రకాల రక్త సంబంధిత వ్యాధులు	డా॥ రాజేష్ బొల్లం	
మెదడు, వెన్నెముక మరియు నరాల వ్యాధులకు: మెదడులో గడ్డలు, రక్త స్రావం, వీపు గడ్డలు, పక్షవాతం, తలకు గాయం, తల నొప్పి, పార్కిన్సన్స్, మరియు ఫిట్స్ వ్యాధులకు, వెన్నుపాము గడ్డలు, డిస్క్ సమస్యలు, ఫ్రాక్చర్ మరియు క్లిష్టమైన న్యూరో శస్త్రచికిత్సలు	డా॥ కె.ఎస్. కిరణ్	
రక్తనాళాల వ్యాధులు : రక్తప్రసరణ ఆగిపోవుట, పాదములు నల్లబడుట, రక్త నాళములు చిట్లి పోవుట, కాళ్ళ నరాలు ఉబ్బడం, రక్త నాళాల పునరుద్ధరణ	డా॥ దేవేందర్ సింగ్	07-04-2024 1వ ఆదివారం ఉ॥ 10 గం॥ నుండి మ॥ 4 గం॥ వరకు
జాయింట్ రీప్లేస్‌మెంట్ : మోకాళ్ళు, తుంటి, మోచేయి, భుజం, కీళ్ళు వెన్నెముక నొప్పులు మరియు ఎముకల సంబంధిత వ్యాధులు	డా॥ మనోజ్ చక్రవర్తి	

అపాయింట్‌మెంట్ కొరకు: 915 424 6125

క్లుప్తంగా

బావిలో దూకిన వృద్ధురాలు

• కాపాడిన దివ్యాంగుడు

శంకరపట్నం: ఓ కాలు సరిగా పని చేయకున్నా బావిలో దూకిన వృద్ధురాలిని కాపాడి శభాష్ అనిపించుకున్నాడు ఓ దివ్యాంగుడు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలో శనివారం ఓ వృద్ధురాలు వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బావి సమీపంలో నివాసముంటున్న బండారి రవి అనే దివ్యాంగుడు గమనించి కాపాడాడు. వృద్ధురాలు కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిసింది. బావిలో దూకిన గడ్డం మల్లీశ్వరి(68)ని కాపాడేందుకు చెట్టు కొమ్మలు పట్టుకొని బావిలో దిగిన రవి నీటమునుగుతున్న మల్లీశ్వరిని రక్షించాడు. బావి వద్ద గుమిగూడిన ప్రజలు తాళ్ల సహాయంతో బావి నుంచి బయటికి తీశారు. వృద్ధురాలికి ఇద్దరు కుమారులున్నారు. వెంటనే 108 వాహనానికి సమాచారమందించి చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

ఆర్మీ సోల్జర్ ఆత్మహత్య

సైదాపూర్: దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న కరీంనగర్ జిల్లాకు చెందిన సైనికుడు నెల్లి రామకృష్ణ(27) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు, మృతుని బంధువులు తెలిపిన వివరాలు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం గొడిశాలకు చెందిన నెల్లి తిరుపతి–స్వరూప దంపతుల కుమారుడు రామకృష్ణ ఆర్మీలో ఐదేళ్లుగా సైనికుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. రెండు నెలల క్రితం స్వగ్రామం వచ్చి వెళ్లాడు. ఆ సమయంలో అక్కడ ఇబ్బందిగా ఉందని తల్లిదండ్రులతో చెప్పినట్లు సమాచారం. శుక్రవారం రాత్రి డ్యూటీ ముగియగానే గదిలోకి వెళ్లిన రామకృష్ణ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహం స్వగ్రామానికి శనివారం చేరుకుంటుందని అక్కడి అధికారులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. రామకృష్ణ మృతిపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రామకృష్ణ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం ఇవ్వాలని భగవంతున్ని కోరారు.

30వ వార్షికోత్సవ శుభాకాంక్షలతో... మీ KITS అకాడమి
1994 నుండి గత 30 సం॥రాలుగా వేలాది ర్యాంకులు సాధించిన సంస్థ మీ KITS
POLYCET
I st బ్యాచ్ - 01-04-2024
II nd బ్యాచ్ - 07-04-2024
INTER FOUNDATION
FOR (SSC) COMPLETED STUDENTS
MPC & BiPC (All Subjects)
ప్రింటెడ్ మెటీరియల్ | హాస్టల్ వసతి కలదు
KITS కోచింగ్ సెంటర్
KNR. Cell: 9346217513



చల్లని సేవలకు సలామ్

- చలివేంద్రాలతో దప్పిక తీరుస్తున్న దాతలు
- పక్షులకు నీళ్లు పెడుతున్న ప్రేమికులు
- ఏళ్లుగా సమాజసేవతో సంతృప్తి
- ఆదర్శం చిరువ్యాపారుల సేవాస్ఫూర్తి

సండే స్పెషల్

మండే వేసవిలో తడారుతున్న గొంతులకు తాగునీరు అందించే వారు కొందరు. నీటి జాడ కనిపించని పక్షుల కోసం దాబాలపై నీటితొట్టీలు పెట్టేవారు మరికొందరు. తాహతమకు మించినప్పటికీ కూలీలు.. బాటసారుల కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు ఇంకొందరు. అందరి ఉద్దేశం సమాజసేవే.. నిండు వేసవిలో గుక్కెడు నీటి కోసం తండ్లాటే మనుషులకు గ్లాసు నీళ్లందించి ప్రాణాలు నిలుపుతున్నారు. భానుడి ప్రతాపానికి విలవిల్లాడే పక్షులకు నీటి తొట్టీలు పెట్టి వాటి మనుగడకు సాయం చేస్తున్నారు. ఇలా.. నిండు వేసవిలో చల్లటి నీటితో ఆప్యాయతలు పంచుతున్న దాతలపై ప్రత్యేక కథనం...

15 ఏళ్లుగా దాహం తీరుస్తూ..


రాచర్లగొల్లపల్లిలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్న లయన్ సభ్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండు వేసవిలో వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రయాణికులు, ప్రజల దాహార్తిని తీర్చాలనే లక్ష్యంతో 15 ఏళ్ల క్రితం 12 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు కలిసి మైత్రి పరివార్ అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. చలివేంద్రాలు ఏర్పాటు చేసి దాహార్తి తీర్చుతున్నారు. 'నీళ్ల దానం మహాదానం' అనే నానుడిని అనుసరించి ఏటా ఎల్లారెడ్డిపేట మండలకేంద్రం, రాచర్లగొల్లపల్లి గ్రామాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. మైత్రి పరివార్ అనంతరం అదే సంస్థలోని సభ్యులు లయన్స్ క్లబ్‌గా ఏర్పడి ఆ సేవలను కొనసాగిస్తున్నారు. లయన్ కోట సతీశ్ సహకారంతో ప్రతీ ఏడాది మార్చి 15 నుంచి జూన్ 10 వరకు రూ.50వేలు ఖర్చుచేసి తాగు నీటితోపాటు మజ్జిగను అందిస్తున్నారు.

సామాజిక సేవతో సంతృప్తి



సామాజిక సేవలో సంతృప్తి ఉంటుంది. వేసవిలో ప్రజలకు తాగు నీటిని అందించాలనే సంకల్పంతో 12 మంది ఉపాధ్యాయులం కలిసి మైత్రి పరివార్‌ను ఏర్పాటు చేశాం. గత 15 ఏళ్లుగా రెండు చలివేంద్రాలను ఏర్పాటు చేసి తాగునీటిని అందిస్తున్నాం. ఈ కార్యక్రమాన్ని ప్రతీ వేసవిలో నిరంతరం కొనసాగిస్తాం.

– ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి, లయన్స్ క్లబ్ జిల్లా క్యాబినెట్ సభ్యుడు, ఎల్లారెడ్డిపేట

పక్షుల కోసం వాటర్‌ఫౌంటేన్


నీరు పెడుతున్న దంపతులు

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని సింగరేణి సంస్థ ఓసీపీ–2లో సేఫ్టీ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎండీ ఆసిఫ్, ఆయన భార్య ఫర్వీన్‌కు పక్షులు, జంతువులు ఉంటే ప్రేమ. స్థానిక విఠల్‌నగర్‌లో ఉంటున్నారు. వేసవిలో పక్షుల దాహార్తి తీర్చేందుకు గత ఎనిమిదేళ్లుగా వారి ఇంటి ఆవరణలో తొలత మట్టి తొట్లు ఏర్పాటు చేశారు. అయితే తొట్టిల్లోని నీరు వేడి అవుతుండడంతో వాటర్‌ఫౌంటేన్ ఏర్పాటు చేశారు. ఒక డ్రమ్ములో చల్లటి నీటిని పోసి, అందులో కూలర్ మోటార్‌ను పెట్టి.. వాటర్ ఫౌంటేన్‌గా తయారు చేశారు. దీన్ని వారి ఇంటిలోని చెట్ల కింద పెట్టి ఫౌంటేన్‌లా నీళ్లు పైకి చిమ్మేలా ఏర్పాట్లు చేశారు. ఇలా పైకి చిమ్మే నీటిలో పక్షులు ఎంచక్కా ఆడుతూ.. చల్లని నీటిని తాగుతున్నాయి. అంతేకాకుండా పక్షుల కోసం ప్రత్యేకమైన ఆహారం తీసుకొచ్చి చెట్లకింద చల్లుతుంటారు.

పక్షుల సేవలో కుటుంబం


నీరు పెడుతున్న చంద్రశేఖర్

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని కాకతీయనగర్‌కు చెందిన బోళ్ల చంద్రశేఖర్–పావని దంపతులు పక్షి ప్రేమికులు. చంద్రశేఖర్ ఎల్‌ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. తమ ఇంట్లోని ఏసీ కంప్రెషర్ల నుంచి కారే నీటిని పక్షుల తాగడాన్ని చూసి చంద్రశేఖర్ చలించిపోయాడు. పక్షుల కోసం తమ డాబాపై ప్రత్యేకంగా నీటితొట్లు ఏర్పా టు చేశారు. నాలుగేళ్లుగా వేసవిలో తమ డాబాపై, వరండాలో తల్లి శ్రీలతతో కలి సి చంద్రశేఖర్ దంపతులు మట్టితొట్లలో నీళ్లు పెడుతున్నారు. వాటి ఆకలి తీర్చేందుకు మరో తొట్టిలో గింజలు పోస్తున్నారు.

స్నేహితుడి కోరిక మేరకు..


ప్రగతినగర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సయ్యద్‌ఖాలిద్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రగతినగర్‌కు చెందిన సయ్యద్ ఖాలిద్ స్థానిక చౌరస్తాలో పదేళ్లుగా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. పదేళ్ల క్రితం ఖాలిద్ గల్ఫ్‌లో ఉన్న సమయంలో స్థానికంగా తాగునీటి గోస ఉండేది. ఆ రోజుల్లో తన మిత్రుడు, స్థానిక న్యాయవాది ఉప్పు రాజు కోరిక మేరకు ప్రగతినగర్ చౌరస్తాలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఏటా వేసవిలో ప్రయాణికుల కోసం చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే ఎండలు ముదరడంతో ప్రస్తుతం ఇక్కడే ఉంటున్న సయ్యద్ ఖాలిద్ త్వరలోనే చలివేంద్రం ఏర్పాటు చేస్తానని తెలిపారు.

బాటసారుల సేవలో..


నీరు అందిస్తున్న సత్యసాయి సేవాసమితి సభ్యులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో పదహారేళ్లుగా సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఏటా వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు జెండా ప్రాంతంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. వివిధ పనుల కోసం జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజలు, ప్రయాణికులు, కూలీల సేవలో తరిస్తున్నారు. దినసరి కూలీలకు ఎండ నుంచి రక్షణకు టోపీలు అందిస్తున్నారు.

ఆదర్శం కూరగాయల వ్యాపారి


జూలపల్లిలో ఏర్పాటు చలివేంద్రం

పెద్దపల్లిరూరల్: మండల కేంద్రానికి చెందిన మైనార్టీ నిరుపేద యువకుడు అతిక్ పాషా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అభిమాని.కూరగాయలు విక్రయించే అతిక్‌పాషా ఏటా వేసవిలో దుద్దిళ్ల శ్రీపాదరావు స్మారకార్థం స్థానిక మండోట వద్ద చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నాడు. ఎవరి నుంచి రూపాయి ఆశించకుండా కూరగాయలు విక్రయిస్తే వచ్చిన లాభాల నుంచే కొంత మొత్తం సమాజసేవకు వెచ్చిస్తున్నాడు. అతిక్‌పాషా స్వస్థలం జూలపల్లి. చిన్న తనంలోనే తండ్రి అనారోగ్యంతో చనిపోగా.. తల్లి కష్టపడి పెంచింది. వారసంతల్లో కూరగాయలు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నాడు.

పక్షి ప్రేమికుడు


పక్షుల కోసం నీరు, గింజలు ఏర్పాటు చేసిన అనంతుల రమేశ్

విద్యానగర్ : కరీంనగర్ కిసాన్ నగర్‌కు చెందిన అనంతుల రమేశ్ పక్షి ప్రేమికుడు. తండ్రి రైతు కావడంతో ఆయన పక్షుల కోసం ఇంటి చుట్టూ వాసాలు, గుంజలకు వరి గొలుసులు వేలాడదీసేవాడు. మట్టి పాత్రల్లో నీళ్లు ఉంచేవాడు. దీంతో ఇంటి పరిసరాలు పిచ్చుకల కిచకిచ రావాలతో సందడిగా ఉండేది. తండ్రి వారసత్వాన్ని రమేశ్ కొనసాగిస్తున్నాడు. పదేళ్లుగా ఇంటిచుట్టూ పల్లె వాతావరణం ఏర్పాటు చేసి పిచ్చుకల కోసం వరి గింజలు, నీటి కోసం ప్రత్యేక పాత్రలు ఏర్పాటు చేసాడు. దీంతో ఆయన ఇంటి చుట్టూ పగలు, రాత్రి తేడాలేకుండా సందడి చేస్తుంటాయి.

జంతు స్నేహితుడు


కుక్కకు బిస్కెట్లు వేస్తున్న సుబ్బారావు

బోయినపల్లి: సైకిల్‌పై వస్తున్న ఆయనను చూడగానే కుక్కలు తోకాడించుకుంటూ వస్తాయి. కవర్‌లో బిస్కెట్లు తీసేవరకు ఎదిరి చూస్తాయి. బిస్కెట్లు వేయగానే ఆనందంగా తింటాయి. పక్కవాడు ఆకలితో గోస పడుతున్న పట్టించుకోని ఈ రోజుల్లో బోయినపల్లిలో సుబ్బారావు కుక్కలకు తన చేను పరిసరాల్లో ఉదయం ఆహారంగా బిస్కెట్లు ఇస్తున్నాడు. 15 ఏళ్ల క్రితం ఆంధ్రా నుంచి వచ్చిన ఈయన బోయినపల్లిలో భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తాడు. నాలుగేళ్ల క్రితం కోవిడ్ సమయంలో ఆహారం దొరకక అల్లాడిన కుక్కలను చూసి చలించిపోయినట్లు చెప్పారు.

జగిత్యాలటౌన్: వారంతా చిరువ్యాపారులే. రూపాయి.. రూపాయి జమచేస్తేనే వారి కుటుంబాలను వెల్లదీసుకోగలరు. కానీ తమ వంతుగా వేసవిలో కస్టమర్లు, ప్రయాణికుల దాహార్తి తీర్చాలనే కోరికతో మినీచలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. గత కొన్నాళ్లుగా తమ తాహతుకు మించినప్పటికీ ప్రయాణికులు, వినియోగదారుల దాహార్తి తీర్చడంలోనే తమకు తృప్తి ఉందంటున్నారు.

15 ఏళ్లుగా..



మంచి చేయాలనే సంకల్పంతోనే నా పండ్ల బండి వద్ద చల్లని నీటి డబ్బాను పెడుతున్నాను. గత 15 ఏళ్లుగా ప్రయాణికుల దాహార్తి తీర్చుతున్నాను. రోజుకు ఐదు నుంచి ఆరు డబ్బాల నీటిని అందిస్తున్నాను. నాకెంతో సంతృప్తినిస్తుంది.

– అబ్దుల్ బాసిద్, పండ్ల వ్యాపారి, జగిత్యాల

కస్టమర్ల కోసం..



నాకు ఉపాధి కల్పిస్తున్న కస్టమర్ల కోసం నీటి డబ్బాను ఏర్పాటు చేస్తున్న. గత పదేళ్లుగా మినీ చలివేంద్రం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది. ఎండలో వచ్చే వారి దాహం తీర్చడం ఎంతో సంతృప్తినిస్తుంది.

– చేని నాగరాజు, తాళం చెవుల తయారీ, విక్రయదారు

మానవ సేవే.. మాధవ సేవ



మనుషులకు సేవ చేస్తే భగవంతునికి చేసినట్లే. అందుకే కొన్నేళ్లుగా జగిత్యాల ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం ఏటా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నాం. సత్యసాయిబాబా సందేశం స్ఫూర్తితోనే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం.

– బట్టు రాజేందర్ సత్యసాయి సేవాసమితి కన్వీనర్ జగిత్యాల

పక్షుల దాహార్తి తీర్చండి


పల్లెప్రకృతివనంలో నీళ్లు పోస్తున్న పంచాయతీ సిబ్బంది

కరీంనగర్‌రూరల్: ఎండలు మండుతున్నాయి. వచ్చే రెండు నెలల్లో తీవ్రత మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ముందస్తుగా స్పందించిన కరీంనగర్ కలెక్టర్ పమేల సత్పతి.. పశువులు, పక్షుల కోసం పల్లెప్రకృతి వనాల్లో నీళ్లు, దాణా అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. దీంతో పంచాయతీల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు పక్షులు, పశువులకు తాగు నీటి సౌకర్యం కల్పనకు చర్యలు తీసుకున్నారు. ప్లాస్టిక్ డబ్బాలు చెట్లకు ఏర్పాటు చేశారు. పక్షుల ఆహారం కోసం ధాన్యం, మొక్కజొన్న, బియ్యం అందుబాటులో ఉంచారు. పశువుల దాహార్తి తీర్చడం కోసం నీటితొట్టిలు అందుబాటులోకి తెచ్చారు. వేసవికాలం పూర్తయ్యే వరకూ ఈ ప్రక్రియ కొనసాగాలని డీఎల్‌పీవోలు, ఎంపీడీవోలు, ఎంపీవోలను కలెక్టర్ ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

సఖీ సెంటర్‌కు యువతులు

వేములవాడ: పట్టణ శివారులోని మహాలక్ష్మి వీధిలో వ్యభిచార గృహాలపై ఎస్సై అంజయ్య ఆధ్వర్యంలో శనివారం దాడులు చేసి నలుగురు యువతులను సఖీ సెంటర్‌కు తరలించినట్లు డీఎస్పీ నాగేంద్రచారి శనివారం తెలిపారు. ఆడపిల్లల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇలాంటి వ్యవహారంలో యువతరం అనారోగ్యం బారినపడే ప్రమాదం ఉందన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

TO-LET

■ 1BHK & 2BHK for Family Behind Laxminarasimha Gardens, Warangal Road, Algunur, KNR. Contact: 8247481770 [K-1187396]

OLD AGE HOME

■ స్టార్ ఓల్డ్ ఏజ్ హోమ్/ హోంకేర్ సర్వీస్: 24 గం॥ వృద్ధులను, పెద్దవారిని, పేషంట్లను, చిన్న పిల్లలను చూసుకోవడానికి, ఇంటి, వంట పని చేయుటకు మీ ఇంటివద్దకే అనుభవం గల వర్కర్లని స్త్రీ/పు॥లను పంపించగలము. సెల్: 8186926067, 8977263124. [W-1220996]

మినరల్ వాటర్ మిషన్స్ (R.O)

■ హాస్టల్‌లకు, పరిశ్రమలకు, గ్రామాలకు కూల్ మిషన్స్, వాటర్ ప్లాంట్ మిషన్స్ (R.O) లభించును. కెమికల్స్, ఫిల్టర్, etc. K.K.ఆక్వా. సెల్: 7306888555, 8121026555. [WA-2217]

WANTED

■ Experienced Supervisors Needed. 1year of Waterproofing Experience Required. Contact Jaya Bharathi Constructions at 8790508663 [HA-10285]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను/పేషెంట్స్‌ను చూసుకొనుటకువర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి+ భోజనం. జీ: 18K. Ph: 9640258899/ 9640468899 [H-799859]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-799726]

■ Hiring Agents (M/F) to Work in Life License an Road Education Consultants TS & AP Good Sal + Incentives. Ph: 7416348701/ 8919438680 [H-799827]

■ Required Electrical Contractors - IRP Infra Tech Pvt Ltd, a Leading Telecom Infrastructure Company is looking for ELECTRICAL CONTRACTORS to Execute Earthing & Electrical Works in Ground Based Telecom Towers in Various Locations of Andhra Pradesh. Interested Contractors Apply by E-mail to electirp24@gmail.com or Contact ✆ 91604 42234, 83098 81908 [OA-468]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824

రసాభాసగా 'సహకార' సమావేశం

- మాజీ చైర్మన్ నిధులు దుర్వినియోగం చేశారంటూ వివాదం
- జిల్లా సహకార అధికారికి ఫిర్యాదు చేసిన డైరెక్టర్లు


మాజీ చైర్మన్ దేవరాజం, డైరెక్టర్ల మధ్య వాదోపవాదనలు

కథలాపూర్: మండలంలోని సిరికొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ సర్వసభ్య సమావేశంలో నిధుల దుర్వినియోగంపై రభస చోటుచేసుకుంది. శనివారం నిర్వహించిన సమావేశానికి డైరెక్టర్లు, రైతులు హాజరయ్యారు. దేవరాజం చైర్మన్‌గా ఉన్న సమయంలో సంఘం నిధులతో నిర్మించిన గోదాం విషయంలో రూ.21లక్షలు, తక్కళ్లపెల్లి పెట్రోల్ బంక్ ఏర్పాటులో రూ.12 లక్షలు, తక్కళ్లపల్లిలో గోదాం వద్ద మట్టిపోసి పనుల్లో రూ.3.80లక్షలు దుర్వినియోగం చేసినట్లు డైరెక్టర్లు ఆరోపించారు. దీనిపై మాజీ చైర్మన్ దేవరాజం మాట్లాడుతూ సహకార సంఘం తీర్మానం మేరకే నిధులు వినియోగించామని తెలిపారు. సంఘం నిధులను దేవరాజం సొంతానికి వాడుకున్నట్లు డైరెక్టర్లు ఆరోపించారు. దేవరాజం నుంచి రికవరీ చేయాలని వాదనకు దిగారు. నిధుల దుర్వినియోగంపై సీఈవో రాము సమాధానం చెప్పాలని డైరెక్టర్లు, రైతులు నిలదీశారు. అనంతరం జిల్లా సహకార అధికారి సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. చైర్మన్ కందరి జీవన్‌రెడ్డి, వైస్ చైర్మన్ బత్తుల నరేశ్, డైరెక్టర్లు నాంపెల్లి శ్రీధర్, చుక్క దేవరాజం, గంగారెడ్డి, కిషన్‌రెడ్డి, గంగనర్సయ్య, లత, చౌదరి, రైతులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి ఒకరు మృతి

ముత్తారం(మంథని): ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ముత్తారంలో శనివారం వాటర్ ట్యాంకర్ ట్రాక్టర్ బోల్తాపడి జంబు శ్రీనివాస్(45) దుర్మరణం చెందాడు. ముత్తారంలో నిర్మాణం చేపట్టిన సీసీ రోడ్డుకు వాటర్ ట్యాంకర్ ట్రాక్టర్ నడుపుతుండగా ప్రమాదం జరిగింది. సంఘటన స్థలాన్ని ఎస్సై మధుసూదన్‌రావు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. శ్రీనివాస్‌కు భార్య దేవక్క, కొడుకు మధుకర్, కూతురు నిరోష ఉన్నారు.

వడదెబ్బతో ఆదర్శ పాఠశాల విద్యార్థి మృతి


అక్షయ్ (ఫైల్)

కొండగట్టు: కొడిమ్యాల మండలం నాచుపెల్లి గ్రామానికి చెందిన కోలకాని అక్షయ్ (13) వడదెబ్బతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొడిమ్యాల మోడల్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న అక్షయ్ శుక్రవారం ఎండ వేడికి జ్వరం బారిన పడ్డాడు. శనివారం అతడిని జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించి ఇంటికి తీసుకొచ్చారు. సాయంత్రం మరోసారి తీవ్రమైన జ్వరం వచ్చి స్పృహ కోల్పోయాడు. ఆసుపత్రికి తరలించే లోపే మృతిచెందినట్లు పేర్కొన్నారు. అక్షయ్ తండ్రి ట్రాక్టర్ డ్రైవర్, తల్లి బీడీలు చుడుతూ అక్షయ్‌ను పోషిస్తున్నారు. కొడుకు మృతితో వారు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

జిల్లాలో వడగాలులు వీచే అవకాశం

జగిత్యాలఅగ్రికల్చర్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వచ్చే నెల 1, 2, 3 తేదీల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. మధ్యాహ్నంతోపాటు రాత్రివేళ వేడిగా ఉంటుందని, పగటి ఉష్ణోగ్రతలు 45డిగ్రీలకు చేరనున్నాయని తెలిపారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా పండ్లతోటలకు వారానికోసారి నీటి తడి ఇవ్వాలని సూచించారు. పశువులు, గొర్రెలు, మేకలను వీలైనంత వరకు ఉదయం, సాయంత్రం మాత్రమే మేతకు తీసుకెళ్లాలని, కోళ్ల ఫారాల షెడ్లపై వరిగడ్డి కప్పాలని, కోళ్లకు చల్లదనం కోసం స్ప్రింక్లర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

మనవడిపై తాత హత్యాయత్నం

- నిద్రిస్తున్న సమయంలో గొడ్డలితో దాడి
- ఆస్పత్రికి తరలింపు.. పరిస్థితి విషమం


మహేశ్

ధర్మారం(ధర్మపురి): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారం గ్రామానికి చెందిన సామంతుల మహేశ్ (28)పై తాత సామంతుల కొమురయ్య హత్యాయత్నం చేశాడు. ఎస్సై సత్యనారాయణ, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొమురయ్యకు కుమారుడు మల్లేశం, కూతురు కనుకవ్వ సంతానం. మల్లేశంకు వివాహమై ఇద్దరు కుమారులు జన్మించిన తరువాత దాదాపు 20ఏళ్ల క్రితం అనారోగ్యంతో మరణించాడు. దీంతో అతడి కుమారులిద్దరు అశోక్, మహేశ్‌ను కొమురయ్య పెంచి పెద్దచేశాడు. ఇద్దరికీ పెళ్లిళ్లు చేసి వారికి తన వ్యవసాయ భూమిని పంపకం చేశాడు. కాగా మహేశ్ తరచూ తాగి వచ్చి తాతతో గొడవపడేవాడు. తన అన్న అశోక్‌కు ఎనిమిది గుంటల భూమి ఎక్కువ ఇచ్చావని దూషిస్తూ బెదిరించేవాడు. ఈ క్రమంలో మహేశ్‌తో ఎప్పటికైనా తనకు ఇబ్బందులు తప్పవని కొమురయ్య భావించాడు. ఇంటి ముందు పడుకున్న మహేశ్‌పై శనివారం వేకువజామున గొడ్డలితో దాడి చేశాడు. ఇంట్లో నిద్రిస్తున్న అతడి తల్లి, భార్యకు మెలకువ వచ్చి బయటకు రావడంతో కొమురయ్య గొడ్డలిని అక్కడే వదిలేసి పరారయ్యాడు. ఈ ఘటనపై మహేశ్ మేనమామ కట్ట కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా మహేశ్‌ను చికిత్స నిమిత్తం కరీంనగర్ తీసుకెళ్లగా, పరిస్థితి విషమించడంతో వరంగల్ ఆసుపత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు.

వివాహానికి వెళ్లి వస్తూ.. తిరిగిరాని లోకాలకు..

- బైక్, బొలెరో ఢీకొని ఇద్దరు దుర్మరణం

జన్నారం(ఖానాపూర్): వివాహానికి వెళ్లివస్తూ ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తిరిగిరాని లోకాలకు వెళ్లిన సంఘటన మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై మృత్యుంజయ సర్కార్ తెలిపిన వివరాల ప్రకారం.. జన్నారం మండలం రేండ్లగూడకు చెందిన దేవి సుదర్శన్(45) కొంతకాలంగా జగిత్యాలలోని అటవీశాఖలో కాంట్రాక్టు ఉద్యోగం చేస్తూ అక్కడే ఉంటున్నాడు. శనివారం దండేపల్లి మండలం లింగాపూర్‌లో తమ బంధువుల ఇంట్లో జరుగుతున్న పెండ్లికి హాజరయ్యేందుకు రేండ్లగూడకు చెందిన తమ అన్న కుమారుడు దేవి రక్షిత్(22)తో కలిసి బైక్‌పై బయలుదేరారు. తిరుగుప్రయాణంలో జన్నారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో జన్నారం నుంచి లక్సెట్టిపేట వైపు వెళ్తున్న బొలెరో వాహనాన్ని ఢీకొట్టారు. ఘటనలో సుదర్శన్ అక్కడికక్కడే మృతిచెందగా రక్షిత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108లో లక్సెట్టిపేట ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. సుదర్శన్‌కు భార్య రాజేశ్వరి, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. రక్షిత్ తండ్రి రాజం బెల్లంపల్లిలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.